# ప్రభాత ఉదయం
తెలుగు దినపత్రిక



రిపోర్టర్లు కావలెను

అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా రిపోర్టర్లు కావలెను.

ఉదయం తెలుగు దినపత్రిక

సంప్రదించండి
ఫోన్: 93910 89608



సంపుటి: 4 | సంచిక: 120 | పేజీలు: 6 | వెల: రూ.3/- | ఆదివారం 9 ఆగస్టు 2026 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి


## కేసీఆర్ చేసినన్ని యాగాలు దేశంలో
# ఎవరూ చేసి ఉండరు: కేటీఆర్

**క్షుద్ర రాజకీయాలు కాంగ్రెస్‌కే చెల్లు.. తెలంగాణ కోసం కొట్లాడిన మాకు తెలియదు**

**నీటి వాటాల విషయంలో తేడా వస్తే తెలంగాణ భగ్గుమంటది**

**నీళ్లు ఎత్తిపోయడం కూడా చేతకాని సిఎం రేవంత్ రెడ్డి**

**మిడియా సమావేశంలో మండిపడ్డ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**



**హైదరాబాద్, ఆగస్టు 8 (ప్రభాత ఉదయం)**

క్షుద్రపూజలు అని చెప్పి క్షుద్ర రాజకీయాలు చేస్తున్నది కాంగ్రెస్ పార్టీయేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. తెలంగాణ కోసం కొట్లాడిన వాళ్లం. తెలంగాణ కోసం త్యాగాలు చేసిన వాళ్లం. క్షుద్ర రాజకీయాలు చేయవలసిన అవసరం తమకు లేదని వెల్లడించారు. అధికారంలో ఉన్నా లేకున్నా తెలంగాణ బాగుండాలని కోరుకుంటాం. కాంగ్రెస్ లాగా పార్టీ క్షుద్ర రాజకీయాలు మాకు తెలియదని పేర్కొన్నారు. హరీష్ రావు గుడికి పోతే తప్పా? ఇలాంటి చిల్లర రాజకీయాలు చేయవచ్చా? కాంగ్రెస్ పార్టీలాగా మేడిగడ్డకు, చెక్ డ్యామ్‌లోనూ ధ్వంసం చేసి ఓట్లు దండుకోవాలని చూడలేదని ఆరోపించారు. నీళ్లు ఉన్నా కూడా రైతులను ఎండబెట్టే కాంగ్రెస్ సంస్కృతి బీఆర్ఎస్‌ది కాదని అన్నారు. కరెంటు ఉండి కూడా వ్యవసాయదారుడికి 24 గంటల కరెంట్ ఇవ్వడం లేదు. ఏ సబ్ స్టేషన్‌కైనా రావడానికి మేము సిద్ధం. 24 గంటల కరెంట్ వస్తే ఇంకా ఎక్కడ ఉందో చెప్పాలి. కనీసం ఐదు, ఆరు సార్లు ప్రతిరోజూ కరెంట్ కోతలు అవుతున్నాయని విమర్శించారు. కోర్టులు చెప్పినా హైడ్రా విషయంలో రేవంత్ రెడ్డి అనుసరిస్తున్న వైఖరిని ప్రజాస్వామిక వాదులు గుర్తించాలని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. రేవంత్ రెడ్డి ప్రజా వ్యతిరేక, రాజ్యాంగ వ్యతిరేక ఆలోచనా విధానాన్ని గుర్తించాలని, రేవంత్ రెడ్డి హిట్లర్ అని చెప్పుకున్నట్లే రాజ్యాంగ వ్యవస్థలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రెండున్నర లక్షల మందికి 58 జీవో ద్వారా పట్టాలు ఇచ్చామని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఒక్క పట్టా అయినా ఇవ్వలేదని, పైగా వేలాది మంది ఇళ్లను కూలగొట్టిందని ఆరోపించారు. హైదరాబాద్ లోని 10,000 ఎకరాల విలువైన భూమి పారిశ్రామిక భూముల విషయంలో రేవంత్ రెడ్డి చేస్తున్న 5 లక్షల కోట్ల స్కామ్ పైన రాష్ట్ర ప్రజలను జాగృతం చేస్తామని కేటీఆర్ వెల్లడించారు. హిల్ట్ పాలసీ ద్వారా రాష్ట్ర ప్రజల సొమ్మును ఏ విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం జేబులో వేసుకుంటుందో ప్రజలందరికీ ..మిగతా 2లో




## హైడ్రాలో 150
# డ్రైవర్ ఉద్యోగాలు

**వేలదిగా తరలివచ్చిన నిరుద్యోగులు**

**సరూర్ నగర్ స్టేడియంలో తోపులాట**

**హైదరాబాద్, ఆగస్టు 8 (ప్రభాత ఉదయం)**

నగరంలోని సరూర్‌నగర్ స్టేడియం వద్ద తోపులాట జరిగింది. హైడ్రాలో 150 డ్రైవర్ ఉద్యోగాల కోసం నిరుద్యోగులు పోటెత్తారు. శనివారం, ఆదివారం డ్రైవర్ల ఎంపిక ఉంటుందని హైడ్రా ప్రకటించింది. దీంతో ఇందులో ..మిగతా 2లో

# నిరుద్యోగులంటే ఎందుకింత కక్ష

**సరూర్ నగర్ ఘటన ముమ్మాటికీ ప్రభుత్వ వైఫల్యమే**

**రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ హామీ మోసానికి నిదర్శనం**

**ఎక్స్ వేదికగా మండిపడ్డ బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు**



**హైదరాబాద్, ఆగస్టు 8 (ప్రభాత ఉదయం)**

హైడ్రాలో డ్రైవర్ పోస్టుల భర్తీకి వచ్చిన నిరుద్యోగులను ప్రభుత్వం అవమానించిందంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరుద్యోగులకు ..మిగతా 2లో

## సాగునీటి ప్రాజెక్టులకు
# 5వేల కోట్లు మంజూరు

**పెండింగ్ ప్రాజెక్టుల పూర్తికి అత్యధిక ప్రాధాన్యం**


**తెలంగాణ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**



**హైదరాబాద్, ఆగస్టు 8 (ప్రభాత ఉదయం)**

సాగునీటి ప్రాజెక్టులకు రూ.5 వేల కోట్ల నిధులు మంజూరు చేసినట్లు తెలంగాణ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. భూసేకరణ, ఆర్ఆర్ కోసం రూ.5 వేల కోట్లు మంజూరు చేశామని వెల్లడించారు. నిధుల కొరతతో సాగునీటి పనులు ఆగొద్దని చెప్పుకొచ్చారు. శనివారం సచివాలయంలో మీడియాతో ..మిగతా 2లో

# జూరాలకు తగ్గుతున్న వరద ప్రవాహం



**గద్వాల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 8 (ప్రభాత ఉదయం)**

మహారాష్ట్ర, కర్ణాటకలో వర్షాలు తగ్గుముఖం పట్టడంతో ప్రియదర్శిని జూరాల జలాశయానికి శనివారం వరద భారీగా తగ్గినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. శనివారం సాయంత్రానికి జూరాలప్రాజెక్టుకు ఎగువ నుంచి 1.73 లక్షల క్యూసెక్కులు ఇన్ ఫ్లో నమోదైంది. దీంతో ప్రాజెక్టు 21 క్రస్ట్‌గేట్లను ఎత్తి 1,38,495 క్యూసెక్కులు వరద నీటిని దిగువకు వదిలామన్నారు. విద్యుదుత్పత్తికి 29,525 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 45, ఎడమ కాల్వకు 820, కుడి కాల్వకు 600, కోయిల్ సాగర్ లిఫ్టుకు 630, నెట్టెంపాడు లిఫ్టుకు 547, భీమా లిఫ్టుకు 1300 క్యూసెక్కులు వినియోగించినట్లు వివరించారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 8.01టీఎంసీలు ఉన్నట్లు తెలిపారు.

## పెద్ది సుదర్శన్ రెడ్డి
# ఇంటికి వెళ్లనున్న కేసీఆర్

**అనారోగ్య కారణాలతో ఇటీవల కన్నుమూసిన పెద్ది సుదర్శన్ రెడ్డి**

**పెద్ది కుటుంబ సభ్యులను పరామర్శించనున్న కేసీఆర్**

**ఇప్పటికే పెద్ది కుటుంబానికి రూ. 2.25 కోట్ల ఆర్థిక సాయాన్ని ప్రకటించిన కేసీఆర్**



**హైదరాబాద్, ఆగస్టు 8 (ప్రభాత ఉదయం)**

పార్టీ ఆవిర్భావం నుంచి తనకు అత్యంత ఆప్తుడిగా, ముఖ్య అనుచరుడిగా ఉన్న నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి మరణంతో విషాదంలో ఉన్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆయన ..మిగతా 2లో




## యూపీఐ ఛార్జీలపై మరింత
# స్పష్టతనిచ్చిన కేంద్రం

**యూపీఐ వినియోగదారులకు ఎలాంటి ఛార్జీలు ఉండవని వెల్లడి**

**భవిష్యత్తులో వ్యాపారులపై నామమాత్రపు ఎండీఆర్ విధించే అవకాశం**

**యూపీఐ వ్యవస్థ మన్నిక, భద్రత కోసమే ఈ చర్యలన్న కేంద్రం**

2




## త్వరలో సీఎన్‌జీలో కూడా
# బయోగ్యాస్ మిళితం

**దేశీయంగా ఉత్పత్తి పెంచాలన్న లక్ష్యంలో కేంద్రం**

**ఇంధన అవసరాలు తీర్చుకునేలా ప్రణాళికలు**

5

# లోయలో పడ్డ బొలెరో వాహనం

**ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురు దుర్మరణం**



2

# కేసీఆర్ చేసినన్ని యాగాలు దేశంలో ఎవరూ చేసి ఉండరు: కేటీఆర్

**మొదటి పేజీ తరువాయి...**

అర్థమయ్యేలా లేఖల రూపంలో, ప్రజెంటేషన్ ల రూపంలో ప్రజల ముందు ఉంచుతామన్నారు. రైతులపై రేవంత్‌రెడ్డికి కనీస పరిజ్ఞానం లేదని తెలిపారు. తాము డిమాండ్ చేస్తేగానీ పంప్‌లు ఎందుకు ఆన్ చేయలేదని

ప్రశ్నించారు. సీఎంకు ఎప్పుడు నీళ్లు ఎత్తిపోయాలో కూడా తెలియదని విమర్శించారు. హరీశ్‌రావు ఈ విషయంపై ప్రశ్నించినా కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు స్పందించలేదని నిలదీశారు. సీఎం రేవంత్ దృష్టిలో భూమి అంటే రియల్ ఎస్టేట్ అని ఎద్దేవా చేశారు.కేంద్రమైనా, రాష్ట్రమైనా నష్టం కలిగించేలా వ్యవహరిస్తే తిరుగుబాటు తప్పదని కేటీఆర్ హెచ్చరించారు.కేంద్ర ప్రభుత్వాన్ని అడ్డు పెట్టుకొని తెలంగాణకు నీటి వాటాల్లో అన్యాయం చేస్తే, తెలంగాణ ఉద్యమానికి మించి మరొక ఆందోళన తెలంగాణలో వస్తుందని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని నందినగర్‌లో మీడియాతో కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. వచ్చేవారం జరిగే జీఆర్ఎంబీ సమావేశం ఎజెండా ఎందుకు అంగీకరించారో ప్రభుత్వం



స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశం ఎజెండా పూర్తిగా తెలంగాణ హక్కులను కాల రాస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ హక్కులను ఏ విధంగా కాపాడతారో రేవంత్, ఉత్తమ్ కుమార్ రెడ్డి సమాధానం చెప్పాలన్నారు. తెలంగాణ వ్యతిరేకి ఆదిత్యనాథ్ దాస్ ని సలహాదారుగా పెట్టుకోవడమే కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన సిగ్గుమాలిన చర్య అని విమర్శించారు. తెలంగాణలో ఒక్క ఇంజనీర్ కూడా లేరా? ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ చెప్పుచేతల్లోకి తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం నడుస్తుంది. చంద్రబాబు చెప్పు చేతల్లో రేవంత్ రెడ్డి నడుస్తున్నాడు. రేవంత్ రెడ్డికి సిగ్గుంటే ఆదిత్యనాథ్ దాస్ ని తొలగించాలని డిమాండ్ చేశారు. నీళ్లు, నిధులు, నియామకాలతో కొట్లాడిన తెలంగాణలో మరోసారి నీళ్ల దోపిడీకి తెలంగాణ గురవుతున్నదని, ఇదే జరిగితే కచ్చితంగా బీఆర్ఎస్ మరోసారి నీళ్ల కోసం ఆందోళన చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి సిగ్గు ఉంటే ఈ సమావేశాన్ని బహిష్కరించాలని సూచించారు. నార్లాపూర్‌ను ముట్టడించి పంపులను ఆన్ చేస్తామని బీఆర్ఎస్ హెచ్చరికలకు ప్రభుత్వం దిగివచ్చి పంపులని ఆన్ చేసిందని వెల్లడించారు. పాలమూరు బిడ్డ అని చెప్పుకునే రేవంత్ రెడ్డికి పాలమూరు నీళు ఇచ్చే సోయి లేదు. వర్షాలు పడి పక్క రాష్ట్రం నీళ్లు ఎత్తి పోసుకుంటే ముఖ్యమంత్రికి పట్టింపు లేదు. ప్రధాన ప్రతిపక్షం ముళ్లు కట్టెతో పొడిస్తేనే ఈ ప్రభుత్వం స్పందిస్తుంది లేదంటే నిద్రపోతున్నదని పేర్కొన్నారు.



# హైడ్రాలో 150 డ్రైవర్ ఉద్యోగాలు

**మొదటి పేజీ తరువాయి...**

పాల్గొనేందుకు నిరుద్యోగులు భారీగా తరలిరావడంతో తోపులాట జరిగింది. ఇటీవల హైడ్రా విడుదల చేసిన 150 డ్రైవర్ పోస్టుల భర్తీ కోసం నిర్వహించిన రిక్రూట్‌మెంట్ ప్రక్రియ తీవ్ర గందగోళానికి దారి తీసింది. డ్రైవర్ పోస్ట్‌ల కోసం రాష్ట్రంలోని నలుమూల నుంచి వేలాది మంది నిరుద్యోగ యువత శనివారం తెల్లవారుజామున 4 గంటల నుంచే భారీగా సరూర్‌నగర్ స్టేడియానికి చేరుకున్నారు. కేవలం 150 పోస్టులు ఉండగా.. ఊహించిన రీతిలో వేలాది మంది పోటెత్తడంతో స్టేడియం మొత్తం నిరుద్యోగులతో కిక్కిరిసిపోయింది. ఈ క్రమంలో కొంత ఉద్రిక్తత, తోపులాట చోటుచేసుకుంది. గంటల తరబడి లైన్లలో వేచి ఉన్నప్పటికీ అధికారుల వైపు నుంచి సరైన ఏర్పాట్లు లేకపోవడంతో నిరుద్యోగులు అసహనం వ్యక్తం చేశారు. కనీసం తాగడానికి మంచి నీరు కూడా ఏర్పాటు చేయకపోవడంతో లైన్లలో వేచి ఉన్న యువత.. నిర్వాహకుల తీరుపై ఆందోళనకు దిగారు. ఉద్యోగం కోసం జిల్లాలు దాటి వస్తే అధికారులు నిర్లక్ష్యంగా ప్రవర్తించారంటూ నిరుద్యోగులు వాపోతున్నారు. వెంటనే స్థానిక పోలీసులు అక్కడకు చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. ప్రస్తుతం అభ్యర్థులకు టోకెన్ ఇచ్చి వెనక్కి పంపిస్తున్నట్లు తెలుస్తోంది. టోకెన్‌లో చెప్పిన టైమ్ ప్రకారం అక్కడకు వచ్చి ఈవెంట్స్‌లో పాల్గొనాలని నిర్వాహకులు చెబుతున్నారు.

# నిరుద్యోగులంటే ఎందుకింత కక్ష

**మొదటి పేజీ తరువాయి...**

రాష్ట్ర ప్రభుత్వం క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. విద్యార్థులు, నిరుద్యోగులు అంటే ప్రభుత్వానికి ఎందుకింత కక్ష అంటూ మండిపడ్డారు. అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేస్తూ.. 32 నెలలు దాటినా ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేదని దుయ్యబట్టారు. రెండు లక్షల ఉద్యోగాల హామీ బోగస్ అయ్యిందంటూ ఫైర్ అయ్యారు. అధికారం కోసం ఎన్నికల సమయంలో విద్యార్థులు, నిరుద్యోగులను నెత్తిన పెట్టుకున్నారు. ఉద్యోగాలు ఇస్తామని హామీలు గుప్పించారు. ఇప్పుడు అదే నిరుద్యోగులు ఉద్యోగాల కోసం రోడ్ల మీదకు వస్తే వారి పట్ల ఇంత కర్కశంగా వ్యవహరిస్తారా అని ప్రశ్నించారు. హైడ్రాలో కేవలం 150 డ్రైవర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇస్తే వేలాది మంది నిరుద్యోగులు దరఖాస్తు చేసుకునేందుకు తరలివచ్చారు. ఇది నిరుద్యోగుల తప్పా లేక ఉద్యోగాలు కల్పించడంలో విఫలమైన మీ ప్రభుత్వం తప్పా అని అన్నారు. ఇంజినీరింగ్ చదివిన విద్యార్థులను ముఖ్యమంత్రి స్థాయిలో 'క్రిమినల్ వేస్ట్' అని అవమానించడం, ఉద్యోగాల కోసం వచ్చిన నిరుద్యోగులను అధికారులు దుర్భాషలాడటం చూస్తుంటే 'యథా రాజా.. తథా అధికారులు' అన్న సామెత గుర్తుకొస్తోంది. అధికారుల నోటివెంట ఇలాంటి మాటలు రావడం మరింత బాధాకరం. ఉద్యోగం కోసం వచ్చిన యువతను గౌరవంగా చూడాల్సిన అధికారులు వారినే అవమానిస్తే ఇక ఈ ప్రభుత్వం ఎవరి కోసం పనిచేస్తున్నట్టు అని అన్నారు. రెండు లక్షల ఉద్యోగాలు నిజంగా భర్తీ చేసి ఉంటే.. ఈరోజు 150 డ్రైవర్ పోస్టుల కోసం వేలాది మంది నిరుద్యోగులు ఇలా క్యూలలో నిలబడాల్సిన పరిస్థితి వచ్చేదా అని అన్నారు. నీ రెండు లక్షల ఉద్యోగాల హామీ బోగస్. నీ జాబ్ క్యాలెండర్ బోగస్. నిరుద్యోగులకు నువ్వు ఇచ్చిన హామీలు బోగస్. మీ పాలనలో ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువతలో నిరాశ పెరుగుతోంది. నోటిఫికేషన్లు సక్రమంగా రాకపోవడం తో పీజీ, పీహెచ్డీ వంటి ఉన్నత విద్య చదివిన యువత కూడా చిన్నచిన్న పోస్టుల కోసం పోటీ పడాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. ఇది ముమ్మాటికీ ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనం. ఉద్యోగాల కోసం వచ్చిన నిరుద్యోగులపై అనుచితంగా, అసభ్యంగా మాట్లాడిన అధికారులపై వెంటనే క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలి. వారిని అవమానించినందుకు విద్యార్థి, నిరుద్యోగలోకానికి ప్రభుత్వం క్షమాపణ చెప్పాలి' అంటూ ఎక్స్‌లో హరీశ్ రావు పోస్ట్ చేశారు. హైడ్రాలో డ్రైవర్ పోస్టుల భర్తీ సందర్భంగా సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియం వద్ద జరిగిన ఘటనలపై హరీశ్ రావు 'ఎక్స్'వేదికగా స్పందించారు. ఇది ముమ్మాటికీ ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని.. ఉద్యోగాలు ఇవ్వాల్సిన ప్రభుత్వం ఉద్యోగాలు ఇవ్వడం లేదని పేర్కొన్నారు.




## యూపీఐ ఛార్జీలపై మరింత

# స్పష్టతనిచ్చిన కేంద్రం

**యూపీఐ వినియోగదారులకు ఎలాంటి ఛార్జీలు ఉండవని వెల్లడి**

**భవిష్యత్తులో వ్యాపారులపై నామమాత్రపు ఎండీఆర్ విధించే అవకాశం**

**యూపీఐ వ్యవస్థ మన్నిక, భద్రత కోసమే ఈ చర్యలన్న కేంద్రం**

**హైదరాబాద్, ఆగస్టు 8 (ప్రభాత ఉదయం)**

యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) లావాదేవీలపై వినియోగదారుల నుంచి ఎలాంటి రుసుములు వసూలు చేయబోమని కేంద్ర ప్రభుత్వం శనివారం స్పష్టం చేసింది. భవిష్యత్తులో వ్యాపార లావాదేవీల కోసం 'మర్చంట్ డిస్కౌంట్ రేట్' (ఎండీఆర్) అమలు చేసినప్పటికీ, అది కేవలం నిర్దిష్ట పరిమితికి మించిన లావాదేవీలపై మాత్రమే ఉంటుందని, అది కూడా నామమాత్రంగానే ఉంటుందని ఆర్థిక మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో వెల్లడించింది.

పేమెంట్ అండ్ సెటిల్‌మెంట్ సిస్టమ్స్ యాక్ట్-2007కు ప్రతిపాదించిన సవరణలపై విస్తృత స్థాయిలో చర్చ జరుగుతున్న నేపథ్యంలో కేంద్రం ఈ స్పష్టతనిచ్చింది. యూపీఐ ద్వారా వ్యక్తుల మధ్య జరిగే (పీ2పీ) లావాదేవీలు యథావిధిగా ఉచితంగానే కొనసాగుతాయని పేర్కొంది. వ్యాపారులపై అకస్మాత్తుగా ఎండీఆర్ భారం మోపబోమని, ఒకవేళ రుసుములు ప్రవేశపెట్టినా అవి డెబిట్ లేదా క్రెడిట్ కార్డులపై విధించే ఛార్జీల కంటే చాలా తక్కువగా ఉంటాయని వివరించింది.

యూపీఐ వ్యవస్థ దీర్ఘకాలిక మన్నికను కాపాడటంతో పాటు, సాంకేతిక అభివృద్ధి, సైబర్ భద్రతను మరింత బలోపేతం చేసే ఉద్దేశంతోనే ఈ సవరణలు చేపడుతున్నట్లు ప్రభుత్వం తెలిపింది. సదరు బిల్లు పార్లమెంటులో ఆమోదం పొందిన అనంతరం, నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా నేతృత్వంలోని కమిటీ ఎండీఆర్ అమలుపై తుది నిర్ణయం తీసుకోనుంది.

2026 జులై నెలలో యూపీఐ ద్వారా రూ. 29.9 లక్షల కోట్ల విలువైన 2,366 కోట్ల లావాదేవీలు నమోదయ్యాయి. ఈ వ్యవస్థ శరవేగంగా విస్తరిస్తున్న క్రమంలో, దాని నిర్వహణకు, సాంకేతిక భద్రతకు నిరంతర పెట్టుబడులు అవసరమని అధికారులు పేర్కొన్నారు. ఇదే తరుణంలో వినియోగదారులకు యూపీఐ సేవలు ఎప్పటికీ ఉచితంగానే అందుతాయని ఫోన్‌పే సీఈఓ సమీర్ నిగమ్ సైతం స్పష్టం చేశారు.

ఇప్పటికే పేమెంట్స్ కౌన్సిల్, ఫోన్ పే యాజమాన్యం కూడా యూపీఐ ఛార్జీలపై వివరణ ఇచ్చిన సంగతి తెలిసిందే.



## సాగునీటి ప్రాజెక్టులకు

# 5 వేల కోట్లు మంజూరు

**మొదటి పేజీ తరువాయి...**

మంత్రి ఉత్తమ్ మాట్లాడారు. పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయడానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నామని స్పష్టం చేశారు. మిడ్‌మానేరు ఎడమ కాలువ పనులను వెంటనే పున:ప్రారంభిస్తామని వివరించారు. పత్తిపాక రిజర్వాయర్‌ను ఫాస్ట్‌ట్రాక్‌లో పూర్తి చేయాలని ఆదేశించారు. పత్తిపాకతో కొత్తగా 10 వేల ఎకరాలకు సాగునీరు ఇస్తామని పేర్కొన్నారు. 2.40 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణెళి లక్ష్యమని మంత్రి ఉత్తమ్ చెప్పుకొచ్చారు. ఆగస్టు నెలాఖరులోగా పత్తిపాక డీపీఆర్ సిద్ధం చేస్తామని తెలిపారు. 96 శాతం పూర్తైన రోళ్లవాగుపై ప్రత్యేక దృష్టి సారించామని అన్నారు. రోళ్లవాగుతో 15 వేల ఎకరాల చివరి ఆయకట్టుకు నీరు అందజేస్తామని చెప్పుకొచ్చారు. భూసేకరణ, టెండర్లు, అనుమతులను సమాంతరంగా చేపట్టాలని అధికారులకు సూచించారు. నిర్వాసితులకు పరిహారం, పునరావాసం వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి పెండింగ్ సమస్యను 'యాక్షన్ పాయింట్'గా మార్చాలని సూచించారు. తదుపరి సమీక్షకు యాక్షన్ టేకెన్ రిపోర్ట్ తప్పనిసరని ఆదేశించారు. ఆయా ప్రాజెక్టులు పూర్తి చేసి రైతులకు నీరందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి ఉత్తమ్ పేర్కొన్నారు.

## యూఏఈ బతుకమ్మ సంబురాలకు

# కేటీఆర్‌కు ఆహ్వానం

**మొదటి పేజీ తరువాయి...**

యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో నిర్వహించనున్న బతుకమ్మ సంబరాలకు ముఖ్య అతిథిగా హాజరు కావాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌ను ఎమిరేట్స్ తెలంగాణ కల్చరల్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ (ఈటీసీఏ--యూఏఈ) ప్రతినిధులు ఆహ్వానించారు. ఈ మేరకు శుక్రవారం నంది నగర్‌లోని కేటీఆర్ నివాసంలో ఆయనను కలిసి ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బతుకమ్మ వేడుకలకు సంబంధించిన పోస్టర్‌ను కేటీఆర్ చేతుల మీదుగా విడుదల చేశారు. ఈటీసీఏ ఆధ్వర్యంలో గత 16 సంవత్సరాలుగా యూఏఈలో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహిస్తున్నామని ప్రతినిధులు కేటీఆర్‌కు తెలిపారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టేలా ప్రతి ఏటా బతుకమ్మతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని వివరించారు. ఈసారి అక్టోబర్ 11, 2026న దుబాయ్‌లోని అల్ అహిలి స్పోర్ట్స్ క్లబ్లో నిర్వహించనున్న బతుకమ్మ సంబురాలకు ముఖ్య అతిథిగా హాజరు కావాలని కేటీఆర్‌ను కోరారు.

# లోయలో పడ్డ బొలెరో వాహనం

**నైనిటాల్, ఆగస్టు 8 (ప్రభాత ఉదయం)**

ఉత్తరాఖండ్‌లో ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. బొలెరో వాహనం లోయలో పడ్డ ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురు ప్రాణాలు కోల్పోయా రు. మరొకరికి తీవ్ర గాయాలు అయ్యాయి. శుక్రవారం ఈ సంఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. దేవ్‌ప్రయాగ్ నుంచి పౌరీ వెళుతున్న బొలెరో వాహనం శుక్రవారం సాయంత్రం సబ్దర్‌ఖల్ వద్ద ప్రమాదానికి గురైంది. రోడ్డు పక్క ఉన్న లోయలో పడిపోయింది. సమాచారం అందుకున్న వెంటనే దేవ్‌ప్రయాగ్ పోలీసులు, ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు. సహాయక చర్యలు చేపట్టారు. ఈ ప్రమాదం జరిగిన సమయంలో బొలెరోలో ఒకే కుటుంబానికి చెందిన 7 మంది ఉన్నారు. వాహనం లోయలో పడగానే తీవ్రగాయాలపాలై ఐదుగురు అక్కడికక్కడే చనిపోయారు. తీవ్రంగా గాయపడ్డ మరో ఇద్దరిని సహాయక సిబ్బంది దగ్గరలోని ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఓ బాలుడు మృతి చెందాడు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ప్రమాదానికి గల కారణాలను అన్వేషిస్తున్నారు.

# విశాఖకు వందేభారత్ స్లీపర్

**న్యూఢిల్లీ ఆగస్టు 8 (ప్రభాత ఉదయం)**



విశాఖపట్నం, ఐటీ రాజధాని బెంగళూరు మధ్య ప్రయాణించే ప్యాసింజర్లు, ఉద్యోగులకు దక్షిణ తీర రైల్వే తీపి కబురు అందించింది. ఈ రెండు నగరాల మధ్య ప్రయాణ సమయాన్ని భారీగా తగ్గించేందుకు కొత్తగా 'వందే భారత్ స్లీపర్ ఎక్స్‌ప్రెస్' రైలును నడిపేందుకు ప్రణాళిక సిద్ధం చేసింది. ఈ మేరకు సమగ్ర నివేదికను తుది ఆమోదం కోసం రైల్వే బోర్డుకు పంపింది. ప్రస్తుతం వైజాగ్ -- బెంగళూరు మధ్య నడిచే సాధారణ రైళ్లకు 17 నుంచి 21 గంటల సమయం పడుతోంది. అయితే, ఈ కొత్త వందే భారత్ స్లీపర్ అందుబాటులోకి వస్తే ప్రయాణ సమయం కేవలం 15 గంటల కంటే తక్కువకే తగ్గిపోనుంది. వారంలో ఆరు రోజుల పాటు ఈ సర్వీసును నడపాలని ప్రతిపాదించారు. బెంగళూరులో రాత్రి 8:00 గంటలకు బయలుదేరే రైలు మరుసటి రోజు ఉదయం 10:00 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో వైజాగ్‌లో రాత్రి 8:15 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 10:00 గంటలకు బెంగళూరు చేరుకుంటుంది. ఈ రైలు గుంటూరు, విజయవాడ, నంద్యాల, ధర్మవరం మీదుగా దాదాపు 1,061 కిలోమీటర్ల మేర సాగనుంది. మార్గమధ్యంలో కృష్ణా కెనాల్ జంక్షన్, దువ్వాడ వంటి కీలక స్టేషన్లలో స్టాప్‌లు ఉంటాయి. సాధారణంగా వందే భారత్ స్లీపర్ రైళ్లు 16 కోచ్‌లతో నడుస్తుండగా, ఈ మార్గంలో ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండటం వల్ల ఏకంగా 20 కోచ్‌ల భారీ రేక్‌తో నడపాలని నిర్ణయించారు. గంటకు 160 కి.మీ గరిష్ఠ వేగంతో ప్రయాణించే సామర్థ్యం ఉన్నప్పటికీ, ట్రాక్ పరిస్థితుల దృష్ట్యా సగటున 75 కి.మీ వేగంతో నడపనున్నారు. విమాన ప్రయాణానికి ధీటుగా ఉండే ఈ స్లీపర్ రైలు ఐటీ నిపుణులకు, తెలుగు ప్రజలకు ఎంతో ఊరటనివ్వనుంది.

## పెద్ది సుదర్శన్ రెడ్డి

# ఇంటికి వెళ్లనున్న కేసీఆర్

**మొదటి పేజీ తరువాయి...**

కుటుంబాన్ని స్వయంగా పరామర్శించనున్నారు. ఇందుకోసం నర్సంపేట నియోజకవర్గ పరిధిలోని పెద్ది స్వగ్రామమైన నల్లబెల్లికి ఆయన వెళ్లనున్నారు. ఇంటి పెద్దను కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న కుటుంబ సభ్యులను పరామర్శించి, ఓదార్చి కష్టకాలంలో పార్టీ ఎల్లవేళలా తోడుగా ఉంటుందనే భరోసా ఇవ్వనున్నారు. ఈ పర్యటనలో భాగంగా పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబంతో పాటు నర్సంపేట నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు, అభిమానులను కలిసి కేసీఆర్ ధైర్యం చెప్పనున్నారు. కాగా, ఇప్పటికే పెద్ది కుటుంబాన్ని ఆదుకునేందుకు బీఆర్ఎస్ పార్టీ తరఫున రూ. 2.25 కోట్ల ఆర్థిక సహాయాన్ని కేసీఆర్ ప్రకటించిన విషయం తెలిసిందే.


# ఫ్లెక్సీల తొలగింపుపై జిహెచ్ఎంసి అధికారులు పక్షపాత వైఖరి




## కాటేదాన్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు ఎస్.వెంకటేష్ ఆగ్రహం

**రాజేంద్రనగర్,ఆగస్టు08(ప్రభాత ఉదయం)**

రాజేంద్రనగర్ నియోజకవర్గం కాటేదాన్ డివిజన్‌లో బీఆర్ఎస్ పార్టీ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను జీహెచ్ఎంసీ అధికారులు తొలగించడంపై పక్షపాత అవలంబిస్తున్నారని కాటేదాన్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు ఎస్.వెంకటేష్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిపక్ష పార్టీకి ఒక న్యాయం, అధికార పక్షానికి మరో న్యాయమా అని ప్రశ్నించారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ..బీఆర్ఎస్ పార్టీకి సంబంధించిన ఫ్లెక్సీలను అధికారులు తొలగిస్తున్నప్పటికీ కాంగ్రెస్ పార్టీకి చెందిన అనధికార ఫ్లెక్సీలను ఎందుకు తొలగించడం లేదని ప్రశ్నించారు. గతంలో కూడా ఇదే విధంగా బీఆర్ఎస్ పార్టీ ఫ్లెక్సీలను తొలగించిన అధికారులు,బీజేపీ,కాంగ్రెస్ పార్టీలకు చెందిన ఫ్లెక్సీలపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని నిలదీశారు.పైస్థాయి నుంచి వచ్చిన ఆదేశాల మేరకే ఫ్లెక్సీలను తొలగిస్తున్నామని అధికారులు,పోలీసులు చెబుతున్నారని ఆయన తెలిపారు. కేవలం ఫ్లెక్సీలను తొలగించినంత మాత్రాన బీఆర్ఎస్ పార్టీకి,కేసీఆర్‌కు, రాజేంద్రనగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి పట్లోళ్ల కార్తీక్‌రెడ్డికి ప్రజల్లో ఉన్న ఆదరణ ఏమాత్రం తగ్గదని బీఆర్ఎస్ శ్రేణులు పేర్కొన్నాయి.కేవలం బీఆర్ఎస్ పార్టీ ఫ్లెక్సీలపైనే అధికారులు చర్యలు తీసుకోవడం అన్యాయమని వెంకటేష్ అన్నారు. బీఆర్ఎస్ అంటే అధికారులకు అంత భయమెందుకని ప్రశ్నించారు. అధికారం ఎప్పటికీ శాశ్వతం కాదని,ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధంగా వ్యవహరించడం సరికాదని అన్నారు.ప్రతిపక్ష పార్టీకి చెందిన ఫ్లెక్సీలను లక్ష్యంగా చేసుకుని తొలగించడం ప్రభుత్వ దిగజారుడు తనానికి నిదర్శనమని వెంకటేష్ ధ్వజమెత్తారు. అన్ని పార్టీలకు ఒకే నిబంధన వర్తింపజేసి,అనధికార ఫ్లెక్సీలపై సమానంగా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

గుంతల మయంగా ఉన్న బుద్వేల్ రోడ్ల లో కంకర పౌడర్ పోసి రోడ్లను బాగు చేయిస్తున్న నాయకులు

## బోనాలకు రోడ్ల మరమ్మత్తులు

**బుద్వేల్, ఆగస్టు 8 (ప్రభాత ఉదయం)**

బోనాల ఉత్సవాలకు రాజేంద్రనగర్, అత్తాపూర్ సర్కిళ్ల లోని రోడ్ల ను బాగుచేశారు. గుంతల మయంగా ఉన్న రోడ్లను కంకర పౌడర్ పోసి బాగు చేశారు. రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి నేతృత్వంలో అత్తాపూర్, రాజేంద్రనగర్ సర్కిళ్ల డిప్యూటీ కమిషనర్ లు మల్లారెడ్డి, బి సురేందర్ రెడ్డి లు, ఎస్ ఈ నరేందర్ గౌడ్, ఈ ఈ శేషయ్య లు ఎక్కడెక్కడ రోడ్లు పాడయ్యాయో చూసి వాటిలో కంకర పౌడర్ పోయించారు

## మార్కెట్ కమిటీ డైరెక్టర్ బుడ్డా సత్యనారాయణను కులం పేరుతో దూషించిన జక్కిడి ప్రభాకర్ రెడ్డి పై చర్యలు తీసుకోవాలి

### తెలంగాణ రాష్ట్ర ఎరుకల సంఘం ప్రధాన సలహాదారులు డాక్టర్ ఎస్. అమరేందర్

**బుద్వేల్ , ఆగస్టు 8 (ప్రభాత ఉదయం) :**



డాక్టర్ సుల్తాన్ అమరేందర్

మార్కెట్ కమిటీ డైరెక్టర్ బుడ్డా సత్యనారాయణను కులం పేరుతో దూసించిన అగ్రకులానికి చెందిన జక్కిడి ప్రభాకర్ రెడ్డి పై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర ఎరుకల సంఘం ప్రధాన సలహాదారులు ఎస్. అమరేందర్ శనివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఎరుకల కులం పేరుతో దూషించిన వ్యక్తి పై పోలీసులు ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా మంచురాబాద్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా కొనసాగుతున్న బుడ్డా సత్యనారాయణ మార్కెట్ కమిటీ డైరెక్టర్ గా నియామకం కావడం జీర్ణించుకోలేని జక్కిడి ప్రభాకర్ రెడ్డిని తను ఇష్టానుసారంగా కులం పేరుతో దూషించడంతోపాటు తన మనోభావాలను దెబ్బతీసేలా మాట్లాడడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. వాడు తక్కువ కులపోడు, అడుక్కుతినేటోడు అంటూ సంభాషించడం పరిశీలిస్తే నేను రెడ్డిని అనే కుల అహంకారం మాట్లాడినట్లు స్పష్ట మౌతుందన్నారు. స్వాతంత్రం సిద్ధించి దశాబ్దాలు గడిచిన కుల అహంకారం ఇంకా కొనసాగడం చాలా విచారకరమన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో అన్ని కులాలు, మతాలు, వర్గాలు సమానమే అనే ఇంకిత జ్ఞానం లేకుండా మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. తక్షణమే జక్కిడి ప్రభాకర్ రెడ్డి పై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి అతన్ని అరెస్టు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అతనిపై చర్యలు తీసుకున్నట్లయితే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న దళిత బహుజనులు ఏకమై ఆందోళన నిరసన కార్యక్రమాలకు దిగాల్సి వస్తుందని హెచ్చరించారు. బుడ్డా సత్యనారాయణ చిన్నప్పటినుండి ఎంతో కష్టపడి తన సామాజిక వర్గంతో పాటు అన్నగారిన వర్గాలకు సేవలు చేస్తూ అండగా ఉన్న ఆయనపై కులం పేరుతో దూషించడం చాలా బాధాకరమన్నారు. తమ ఎరుకల కులమే కాకుండా దళిత బహుజనులను కించపరిచినట్లేనన్నారు. డాక్టర్ ఎస్ అమరేందర్ విచారం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా దళిత బహుజనులు ఏకతాటిపైకి రావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.



## రాజేంద్రనగర్‌లో ఘనంగా బోనాల పండుగ ఏర్పాట్లు: బి జె పి నాయకులు వై శ్రీధర్

### అమ్మవారికి ప్రత్యేక అభిషేకం,నూతన వస్త్రాల అలంకరణ

**రాజేంద్రనగర్,ఆగస్టు08(ప్రభాత ఉదయం)**

రాజేంద్రనగర్‌లోని ఈదమ్మ,భూలక్ష్మమ్మ దేవాలయంలో బోనాల పండుగను పురస్కరించుకుని శనివారం అమ్మవారికి ప్రత్యేక అభిషేకం నిర్వహించి నూతన వస్త్రాలతో అలంకరించారు. అనంతరం ఆలయానికి వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.ప్రతి సంవత్సరం నిర్వహించే బోనాల పండుగను ఈ ఏడాది కూడా ఘనంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో విస్తృత ఏర్పాట్లు చేశారు. ఆలయాన్ని పూలు,విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. ఆదివారం ఉదయం 7 గంటలకు తొట్టెల ఊరేగింపు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం భక్తులు బోనాలను స్వీకరించి అమ్మవారికి సమర్పించేందుకు ఏర్పాట్లు చేశారు.ఉదయం ప్రారంభమయ్యే బోనాల వేడుకలు రాత్రి వరకు కొనసాగనున్న నేపథ్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సకల సౌకర్యాలు కల్పించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు వై.శ్రీధర్,ప్రధాన కార్యదర్శి కే.శ్రీధర్,భక్తులు ఈ.వేణుగోపాల్,ఈ.యాదగిరి,కే.నాగేష్,కే.శశిధర్,రాములు తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.


## ప్రశాంతంగా బోనాల పండుగ నిర్వహించాలి

### బొల్లారం పోలీస్ ఇన్స్పెక్టర్ సుధీర్ కుమార్

**పటాన్ చెరు, ఆగస్టు 8 (ప్రభాత ఉదయం)**



ఐడిఏ బొల్లారం పోలీస్‌స్టేషన్ పరిధిలో నేడు నిర్వహించనున్న బోనాల పండుగను ప్రజలు ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని బొల్లారం పోలీస్ ఇన్స్పెక్టర్ సుధీర్ కుమార్ కోరారు. పండుగ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసుల ఆధ్వర్యంలో భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు. నిర్వాహకులు, ప్రజలు పోలీసులకు సహకరించాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా డీజేలు వినియోగించి ప్రజలకు అసౌకర్యం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



బుద్వేల్ కోట మైసమ్మ దేవాలయం

## నేడు రాజేంద్రనగర్, అత్తాపూర్ సర్కిళ్లలో బోనాలు

**బుద్వేల్ ,ఆగస్టు 8 (ప్రభాత ఉదయం) :**

ఆషాడ మాసం బోనాల పండుగకు రాజేంద్రనగర్ అత్తాపూర్ సర్కిళ్ల పరిధిలోని అమ్మ వారి దేవాలయాలు ముస్తాబయ్యాయి. పండుగ సందర్భంగా దేవాలయాలను చూడముచ్చటైన రంగులతో అందంగా అలంకరించారు. శనివారం రాత్రి దేవాలయాలకు తొట్టేలను ఊరేగింపుగా తీసుకువచ్చారు. అమ్మవారికి సమర్పించారు. ఆదివారం తెల్లవారుజామున అమ్మవారి కి అభిషేకాలు అనంతరం అలంకరణ తో బోనాల పండుగ పూజా కార్యక్రమాలు ప్రారంభం కానున్నాయి. భక్తులు తీసుకువచ్చే బోనాలను నైవేద్యంగా అమ్మవారికి సమర్పించి మొక్కలు చెల్లించుకుంటారు. ఈ సందర్భంగా దేవాలయాల వద్ద భక్తులకు ఇబ్బంది కలగకుండా భారీ ఏర్పాట్లు చేపట్టారు.

## బీజేపీ ఓ బీ సీ మోర్చా వికారా బాద్ జిల్లా ఇంచార్జి గా డి సత్యనారాయణ ముదిరాజ్

**బుద్వేల్, ఆగస్టు 8 (ప్రభాత ఉదయం)**



బీజేపీ ఓబీసి మోర్చా వికారాబాద్ జిల్లా ఇన్చార్జిగా రాజేంద్రనగర్ గాంధీనగర్ కు చెందిన డి సత్యనారాయణ ముదిరాజ్ నియమితులయ్యారు . ప్రస్తుతం డి సత్యనారాయణ ముదిరాజ్ బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకులుగా కొనసాగుతున్నారు. ఈ సందర్భంగా డి సత్యనారాయణ ముదిరాజ్ మాట్లాడుతూ, వికారాబాద్ జిల్లాలో బీసీ లనంతా ఐక్యపరిచి బీజేపీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు. తనకు వికారాబాద్ జిల్లా ఓబీసీ మోర్చా బాధ్యతలు అప్పగించిన పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు.



## బోనాల పండుగకు జిల్లా గణేష్‌ను ఆహ్వానించిన ఆలయ కమిటీ సభ్యులు

**కూకట్ పల్లి, ఆగస్ట్ 8 (ప్రభాత ఉదయం)**

శేరిలింగంపల్లి నియోజకవర్గ ఉమ్మడి ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని పలు అమ్మవారి దేవాలయ కమిటీ సభ్యులు కాంగ్రెస్ సీనియర్ నాయకులు జిల్లా గణేష్ నేత ఆహ్వాన పత్రిక అందజేసి బోనాల పండుగ సందర్బంగ అమ్మవారి పూజ కార్యక్రమంలో పాల్గొని అమ్మవారి ఆశీర్వాదం తీలుకోవాల్సిందినగా కోరారు. ఈ సందర్భంగా జిల్లా గణేష్ మాట్లాడుతూ బోనాల పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తూ తెలంగాణ సాంస్కృతి సాంప్రదాయలకు ప్రతీక బోనాల పండుగ, ఆషాడ మాస చివరి ఆదివారం హైదరాబాద్ చుట్టుపక్కల అన్ని ప్రాంతాల్లో ఘనంగా నిర్వహిస్తారని ఈ పూజ కార్యక్రమంలో నన్ను ఆహ్వానించడం ఆనందంగా ఉందని అన్నారు . ఈ కార్యక్రమంలో పలు కాలనీల ఆలయ కమిటీ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.


# ఏడాది నుంచి గ్యారేజీలోనే ఆటో

### రూ. లక్షలు వెచ్చించి తెస్తే... మూలన పడేశారు

### గద్వాలలో అస్తవ్యస్తంగా చెత్త వాహనాల నిర్వహణ

### మున్సిపాలిటీ తీరుపై తీవ్ర విమర్శలు

**గద్వాల జిల్లా ప్రతినిధి,ఆగస్టు 8(ప్రభాత ఉదయం)**




ప్రజల పన్నుల డబ్బులతో లక్షల రూపాయలు వెచ్చించి కొనుగోలు చేసిన చెత్త సేకరణ వాహనాలు అధికారుల నిర్లక్ష్యం వల్ల గ్యారేజీలకే పరిమితమవుతున్నాయి. గద్వాల మున్సిపాలిటీ పరిధిలోని 37వార్డులలో పారిశుధ్య నిర్వహణ కోసం మొత్తం 19 ఆటోలు, 7 ట్రాక్టర్లను అందుబాటులో ఉంచారు. అయితే, సరైన మెంటనెన్స్ నిర్వహణ లేకపోవడంతో ప్రతి నెలా ఏదో ఒక వాహనం రిపేరు పేరిట మూలన పడుతోంది. ఇందులో ప్రతినెలా ఒకటి రెండు ఆటోలు మరమ్మతుల పేరిట మూలన పడుతున్నాయి. దీంతో చెత్త సేకరణకు వాహనాలు లేక ఇబ్బందులు ఎదురువుతున్నాయి.చెత్త సేకరణకు ఉపమోగించే వాహనాలను గుంతల రోడ్లపై తిప్పుతుండడంతో మరమ్మతులు వస్తున్నాయి. మరమ్మతులు సక్రమంగా చేయించకపోవడంతో తరుచూ వాహనాలు రిపేరు షెడ్డుకు చేరుతున్నాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రతినెలా వేలాది రూపాయల వరకు రిపేర్ల కోసం వెచ్చించాల్సి వస్తుండడంతో మున్సిపల్‌పై ఆర్థిక భారం పడుతున్నది. ఏడాది దాటినా పట్టించుకోని వైనం: ఒక వార్డుకు కేటాయించిన చెత్త ఆటో మరమ్మతు కోసం గ్యారేజీకి వెళ్లి ఏడాది కాలం దాటుతున్నా, దానిని బాగు చేయించి తిరిగి రోడ్డుపైకి తీసుకురావడంలో మున్సిపల్ అధికారులు పూర్తిగా విఫలమయ్యారు. లక్షల రూపాయల ప్రజాధనాన్ని వెచ్చించి తెచ్చిన వాహనాన్ని ఇలా గ్యారేజీలోనే మురగబెట్టడం ఏంటని పట్టణ ప్రజలు తీవ్రస్థాయిలో మండిపడుతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు చెత్త వాహనాల నిర్వహణపై సరైన దృష్టి సారించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

# పెద్దచింతరేవుల ఆంజనేయ స్వామికి ఉడిపి,పాలిమర్ పీఠాధిపతుల ప్రత్యేక పూజలు







**గద్వాల జిల్లా ప్రతినిధి,ఆగస్టు 8(ప్రభాత ఉదయం)**

గద్వాల జిల్లా దరూర్ మండల పరిధిలోని పెద్ద చింతరేవుల గ్రామంలో 18వ శతాబ్దకాలంలో కృష్ణానది తీరాన,జూరాల ప్రాజెక్టు పక్కన వెలసిన ఆంజనేయ స్వామి వారికి ఆషాడ కృష్ణ దశమి శనివారం నాడు ఉత్తరాది మఠం పీఠాధిపతులు 1008 విద్యా దేశ తీర్థ శ్రీ పాదుల వారు,1008 విద్యా రాజేశ్వర తీర్థ శ్రీపాదుల వారు శనివారం నాడు పెద్ద చింతరేవుల ఆంజనేయ స్వామి ఆలయంలో స్వామివారికి ప్రత్యేకంగా విశేష సుగంధ ద్రవ్యాలతో అభిషేక పూజలు, అలంకరణ, అష్టోత్తర, మహా మంగళహారతి పూజలు వేద మంత్రో చరణాల మధ్య నిర్వహించారు.ఆధ్యాత్మికత భక్తులకు మానసిక ప్రశాంతత మరియు ఐశ్వర్యాలతో స్వామివారిని కోలవడం, స్వామివారి కృపా కటాక్షాలు పొందుటకు,సుగమం అవుతుందని అన్నారు. ఆంజనేయ స్వామి వారిని పూజించిన భక్తులకు ధీరత్వం ధైర్యం సాహసం విశేషమేతంగా ఉంటుందని అన్నారు. పెద్ద చింతరేవుల అన్న ప్రసాద కమిటీ వారిచే స్వామివారిని దర్శించుకున్న భక్తులందరికీ అన్న ప్రసాద పంపిణీ, అల్పార పంపిణీ చేశారు.నేటి నుండి 55 రోజులపాటు ఆలయాన్ని సందర్శించిన భక్తులందరికీ అల్పాహార,అన్నప్రసాద వసతి ఉ ఒదని,వినియోగించుకోవాలని ఆయన కోరారు.18వ శతాబ్దంలో వ్యాస శేషదాసుల వారు ప్రతిష్టించినట్లు ఆలయ ప్రధాన అర్చకులు ఆద్య చక్రవర్తి కేశవాచార్యులు వివరించారు. భక్తులు గురువులను సందర్శించిన, సేవచేసిన, గురువులను పూజించిన గురుబలం ప్రార్థిస్తుందని అన్నారు.ఈ కార్యక్రమంలో ఆద్య వామనాచారి, ఆద్య కిష్టా చారి,ఆద్య మద్వాచారి పూజారులు,భక్తులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



## కార్మిక చట్టాల సవరణను వ్యతిరేకించాలి

### రైతాంగ వ్యవసాయ కూలీ పోరాటాలకు అండగా జైల్ భరో లో పాల్గొనాలి

**గద్వాల జిల్లా ప్రతినిధి,ఆగస్టు 8(ప్రభాత ఉదయం)**

కార్మిక చట్టాల సవరణను వ్యతిరేకిస్తూ, రైతాంగ వ్యవసాయ కూలీల అండగా ఆగస్టు 10న జరిగే జైల్ భరో కార్యక్రమంలో ప్రతి కార్మికుడు, రైతులు వ్యవసాయ కూలీలు పాల్గొనాలని సిఐటియు జిల్లా అధ్యక్షుడు ఉప్పేర్ నరసింహ పిలుపునిచ్చారు.శనివారం వడ్డేపల్లి మండల కేంద్రంలో వివిధ రంగాల కార్మికులతో ఏర్పాటు చేసిన సమావేశాలలో పాల్గొని, కరపత్రాలు విడుదల చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... యూనియన్ గవర్నమెంట్ 44 కార్మిక చట్టాలను రద్దు చేసి వాటి స్థానంలో వేతనాల కోడ్ 2019,పారిశ్రామిక సంబంధాల కోడ్, వృత్తి పరమైన భద్రతా ఆరోగ్యం, పని పరిస్థితుల కోడ్, సామాజిక భద్రతా కోడ్ లను తీసుకువచ్చి,సంపదను సృష్టిస్తున్న కార్మిక వర్గాన్ని నిర్వీర్యం చేసే విధానాలకు పాల్పడుతున్నదని విమర్శించారు. సంపదను సృష్టించే వర్గాలకు వాటా ఇవ్వకుండా బడా పెట్టుబడిదారులకు కార్పొరేట్ శక్తులకు దేశ సంపదను,సహజ వనరులను దారాదత్తం చేస్తున్నారని విమర్శించారు.విదేశీ వ్యాపారం పేరుతో విదేశీ వస్తువులపై సుంకాలు ఎత్తివేసి,స్వదేశీ రైతాంగాన్ని కార్పొరేట్ శక్తులకు దోచి పెడుతున్నారని విమర్శించారు. వలసలను నివారించడం కోసం,స్థానికంగా ప్రజలకు ఉపాధి కల్పించడం కోసం వామపక్షాలు సుదీర్ఘ పోరాటాల ద్వారా సాధించుకున్న పనికి ఆహార పథకాన్ని ఎత్తివేసే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వకుండా,స్వదేశీ వ్యవసాయాన్ని నిర్వీర్యం చేస్తూ,ఉపాధి కూలీల పొట్ట కొడుతున్న ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఆగస్టు 10న జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని జరిగే దేశవ్యాప్త జైల్ భరో కార్యక్రమానికి వడ్డేపల్లి మండల కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు అధిక సంఖ్యలో తరలి రావాలని కోరారు. ఈ సమావేశంలో మండల కన్వీనర్ సంజీవ రాజు, హమాలీ సంఘం అధ్యక్షుడు భీముడు, అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ మండల అధ్యక్షురాలు సలోమీ మున్సిపల్ కార్మికులు అంజి, రవీందర్,రేణుక,అంగన్వాడీలు ఫరీదా బేగం సోమేశ్వరీ మణెమ్మ, ఆశా కార్యకర్త హసీనా వివిధ రంగాల కార్మికులు పాల్గొన్నారు.



## కూకట్‌పల్లి అభివృద్ధి విషయంలో రాజకీయాలకు అతీతంగా అందరం కలిసి పనిచేయాలి

### ఎన్నికల సమయంలో రాజకీయంగా పోరాడుదాం

### టీపీసీసీ ఉపాధ్యక్షులు, కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ బండి రమేష్

**కూకట్‌పల్లి, అగస్ట్ 8 (ప్రభాత ఉదయం)**

కూకట్‌పల్లి నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా పార్టీలకు అతీతంగా కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని టీపీసీసీ ఉపాధ్యక్షులు, కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ బండి రమేష్ అన్నారు. ఎన్నికల సమయంలో రాజకీయంగా పోరాడదామని, ప్రస్తుతం కూకట్‌పల్లి అభివృద్ధి కోసం అందరం కలిసి పనిచేద్దామని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుకు తాను కోరినట్లు తెలిపారు. కూకట్‌పల్లి వసంత్‌నగర్ డివిజన్‌లోని ఎస్ ఎం ఆర్, విశ్వంభర కాలనీల్లో నియోజకవర్గ నాయకులు మాకినేని యాక నారాయణ వినోద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజా పాదయాత్రకు బండి రమేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ పాదయాత్రలో కాలనీ వాసులు, డివిజన్ అధ్యక్షులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బండి రమేష్ కాలనీల్లో పర్యటిస్తూ ప్రజలను పేరుపేరునా పలకరించి, వారి సమస్యలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. స్థానికంగా ఉ న్న రోడ్లు, డ్రైనేజీ, మౌలిక వసతులు తదితర సమస్యలను పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

**కూకట్‌పల్లి అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత**

ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ జేఎన్టీయూ సమీపంలో స్కైవాక్, గోపాల్‌నగర్--మంజీరా రోడ్ అభివృద్ధి పనుల గురించి ప్రస్తావించారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలోని మైసమ్మ చెరువు, కాముని చెరువు, సున్నం చెరువు, ఐడియల్ చెరువులను హైడ్రా సహకారంతో ఆక్రమణల నుంచి విముక్తి కల్పించి, వాటిని అభివృద్ధి చేసి సుందరీకరించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలోని సమస్యల పరిష్కారంపై సిఎంసీ కమిషనర్ సృజన ని కలిసి చర్చించానని, సమస్యలపై ఆమె సానుకూలంగా స్పందించారని అన్నారు. ప్రాధాన్యతా క్రమంలో నిధులు కేటాయించి, తన దృష్టికి వచ్చిన ప్రతి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని కమిషనర్ హామీ ఇచ్చినట్లు బండి రమేష్ తెలిపారు. కూకట్‌పల్లి అభివృద్ధి విషయంలో రాజకీయాలకు అతీతంగా అందరం కలిసి పనిచేయాలి. ఎన్నికలు వచ్చినప్పుడు రాజకీయంగా పోరాడుదాం.. కానీ ప్రజల సమస్యలు, నియోజకవర్గ అభివృద్ధి విషయంలో కలిసి ముందుకు సాగుదాం" అని బండి రమేష్ స్పష్టం చేశారు. వసంత్‌నగర్ ప్రాంత ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు పాదయాత్ర కార్యక్రమాన్ని నిర్వహించిన యాక నారాయణ వినోద్ నిర్వాహకులను బండి రమేష్ అభినందించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు శ్రీనివాస్ బాబు, సాయిబాబు చౌదరి, రంగమోహన్, చవ్వ శ్రీనివాస్, మాధవరెడ్డి, శివరామకృష్ణ, నవీన్, గోపాల్ చౌదరి, రమణ, వాసు, సంధ్య తదితరులు పాల్గొన్నారు.



## గుమ్మడిదలలో అంగరంగ వైభవంగా బోనాలు

### ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

**పటాన్ చెరు, ఆగస్టు 8 (ప్రభాత ఉదయం)**

గుమ్మడిదల మున్సిపల్ కేంద్రంలో శనివారం నిర్వహించిన దుర్గమ్మ తల్లి బోనాల ఉ త్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ వేడుకలకు పటాన్ చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న ఎమ్మెల్యేకు నిర్వాహకులు, భక్తులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బోనాల పండుగ ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలంతా భక్తిశ్రద్ధలతో బోనాల ఉత్సవాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. తెలంగాణలో బోనాల పండుగకు ప్రత్యేకమైన ప్రాధాన్యత ఉందని, తరతరాలుగా వస్తున్న ఆధ్యాత్మిక, సాంస్కృతిక సంప్రదాయాలను భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. పండుగలను ప్రజలంతా ఐక్యతతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని సూచించారు. గుమ్మడిదల ప్రాంతం మరింత అభివృద్ధి చెందేలా ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా తాము నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. అమ్మవారి ఆశీస్సులతో గుమ్మడిదల ప్రాంత ప్రజలందరికీ మంచి జరగాలని, నియోజకవర్గం సుభిక్షంగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్, వైస్ చైర్మన్ సంధ్య గోవర్ధన్ రెడ్డి, విజయ్ భాస్కర్ రెడ్డి, ఆయా వార్డుల కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, బి ఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు,నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, నిర్వాహకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




## దేశంలో మోడీని ఎవరు ప్రశ్నిస్తే వాళ్ళని దేశ ద్రోహులుగా ముద్రిస్తున్నారు

### మోడీ దేశ సంపదను కార్పొరేట్లకు దారాదత్తం చేస్తున్నారు

**గద్వాల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 8(ప్రభాత ఉదయం)**

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం దేశ సంపదను కార్పొరేట్ సంస్థలకు దారదత్తం చేస్తూ సామాన్య ప్రజలపై భారాలు మోపుతోందని సీపీఐ జిల్లా కార్యదర్శి బి. ఆంజనేయులు విమర్శించారు.శనివారం ఇటిక్యాల మండలంలో సీపీఐ ఆధ్వర్యంలో ధరలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ పాదయాత్ర నిర్వహించారు. ఇటిక్యాల సర్కిల్ హైవే రోడ్డు నుంచి పొగాకు కంపెనీ మీదుగా జింకలపల్లి వరకు పాదయాత్ర కొనసాగింది.ఈ సందర్భంగా బి. ఆంజనేయులు మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వ విధానాల వల్ల పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్‌తో పాటు నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగి సామాన్య ప్రజల జీవనం భారంగా మారిందన్నారు. వెంటనే ధరలను నియంత్రించి ప్రజలకు ఉపశమనం కల్పించాలని డిమాండ్ చేశారు.దేశ సంపదను కొద్దిమంది కార్పొరేట్లకు అప్పగిస్తూ ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించడం మానుకోవాలని అన్నారు. రైతులకు పంటలకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలని, యువతకు ఉద్యోగాలు కల్పించాలని, కార్మికుల హక్కులను పరిరక్షించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ధరల పెరుగుదలపై ప్రజలను చైతన్యపరుస్తూ సీపీఐ ఆధ్వర్యంలో ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని ఏఐటియుసి జిల్లా కార్యదర్శి జి రంగన్న హెచ్చరించారు. ఎవరు ప్రశ్నించినా, పోరాడిన, ఉద్యమించిన అందరినీ ద్రోహులుగా ముద్రించడం సిగ్గుచేటు అని, అలా చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.



## భారీ వర్షాల కారణంగా రోడ్లు మునిగిపోకుండా

### చర్యలు చేపట్టిన జిహెచ్ఎంసి సిబ్బంది

**పటాన్ చెరు, ఆగస్టు 8 (ప్రభాత ఉదయం):**

భారీ వర్షాల కారణంగా రోడ్లు మునిగిపోకుండా ముందస్తు చర్యలలో భాగంగా జిహెచ్ఎంసి సిబ్బంది చర్యలు చేపట్టారు. బొల్లారం మున్సిపల్ డివిజన్ పరిధిలోని ప్రధాన రహదారిపై నీరు నిలిచిపోయి ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఫిర్యాదులు అందుతున్న నేపథ్యంలో జిహెచ్ఎంసి సిబ్బంది చర్యలకు ఉపక్రమించి నీటి సరఫరాకు అంతరాయం కలగకుండా అడ్డంకులను తొలగించారు.






## శ్రీ శ్లోక పాఠశాలలో ఘనంగా బోనాల వేడుకలు

**పటాన్ చెరు, ఆగస్టు 8 (ప్రభాత ఉదయం)**

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగను శ్రీ శ్లోక ఇంటర్నేషనల్ స్కూల్‌లో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణాన్ని సంప్రదాయ రీతిలో అలంకరించారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి బోనం సమర్పించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన తెలంగాణ జానపద నృత్యాలు, జానపద గీతాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ కొత్వాల్ హరికృష్ణ రెడ్డి మాట్లాడుతూ విద్యతో పాటు భారతీయ సంస్కృతి, తెలంగాణ సంప్రదాయాలను విద్యార్థులకు పరిచయం చేయాల్సిన బాధ్యత విద్యాసంస్థలపై ఉందన్నారు. ఇటువంటి సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో సంప్రదాయాల పట్ల గౌరవం, విలువలు పెంపొందుతాయని తెలిపారు. బోనాల పండుగ విశిష్టతను విద్యార్థులకు తెలియజేస్తూ, మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడమే లక్ష్యంగా కార్యక్రమాన్ని నిర్వహించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో అకడమిక్ డైరెక్టర్లు సింహాచలం, మహిపాల్ రెడ్డి, ప్రిన్సిపల్ హరిప్రియ, వైస్ ప్రిన్సిపల్ ప్రసాద్, గీతాంజలి రోబోటిక్ పాఠశాల కరస్పాండెంట్ కిషోర్, పాఠశాల ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరై వేడుకలను విజయవంతం చేశారు.

# సంప్రదాయ వైభవంతో గీతాంజలి రోబోటిక్ స్కూల్‌లో బోనాల వేడుకలు





**పటాన్ చెరు, ఆగస్టు 8 (ప్రభాత ఉదయం)**

ఇస్నాపూర్ లోని గీతాంజలి రోబోటిక్ పాఠశాలలో శనివారం బోనాల వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తుల్లో పాల్గొని, బోనాల పండుగ విశిష్టతను చాటేలా కార్యక్రమాన్ని ఉత్సాహంగా జరుపుకున్నారు. బోనాల పండుగ, తెలంగాణ సాంప్రదాయాలు, ఆవశ్యకత గురించి విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ఈ వేడుక దోహదపడుతుందని పాఠశాల నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ గౌరి, ప్రియదర్శిని, మాధవి, నాగరాణి, దివ్య, కల్పన, లక్ష్మి, సునీత, శిరీష, వందన, కృష్ణవేణి,సుప్రిత తో పాటు సిబ్బంది లక్ష్మి,దుర్గ సోనాలి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. పండుగ సందర్భంగా పాఠశాల ప్రాంగణంలో సందడి నెలకొంది.

# గద్వాల ఎమ్మెల్యే  ఆధ్వర్యంలో 99 ప్యాకేజీ కాలువల పనులు

### రైతులకు నీళ్లు అందించడమే పరామవధిగా కాలువ పనుల కొనసాగింపు

### కాలువల పనులను పరిశీలించిన గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి

**గద్వాల జిల్లా ప్రతినిధి,ఆగస్టు 8 ప్రభాత ఉదయం)**





ఈరోజు గద్వాల నియోజకవర్గం ధరూర్ మండలంలో గుడెందొడ్డి రిజర్వాయర్ 99 ప్యాకేజీ కాలువ పనులను కాంట్రాక్టర్లు మధ్యలోనే వదిలేయడంతో కాలువల నుండి నీరు ప్రవహించకుండా జమ్మూ మరియు మట్టి పేరుకుపోవడంతో లిగద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి లి స్వయంగా ఇటచి, జేసీబీలను ఏర్పాటు చేసి గుడ్డెందొడ్డి, మన్నాపురం, ధరూర్, సోంపురం, పాచర్ల, చిన్నపాడు, సంఘాల, పరమల, కొండపల్లి, పూడూర్ గ్రామాల పొలాల గుండా వెళ్లే కాలువల పూడికతీతను పచర్ల సోంపురం కాలువ దగ్గర పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఎమ్మెల్యే  మాట్లాడుతూ..గద్వాల నియోజకవర్గ రైతుల భూముల చివరి ఆయకట్టు వరకు నీటిని అందించాలన్న సంకల్పంతో స్వంత ఖర్చులతో రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా కాలువల ద్వారా నీటిని అందిచడం జరుగుతుందన్నారు.ఎల్నినో ప్రభావంతో నీటి ఎద్దడీని తట్టుకోవడం కోసం అన్ని చెరువులను నీటితో నింపి ప్రతి ఎకరాకు నీరు చేరే విదంగా ప్రయత్నాలు కొనసాగుతాయని ,ఎట్టి పరిస్థితిలో భూగర్భ జలాలను పెంచి కాలువలే దగ్గర ఉన్న పొలాలే కాకుకుండా బోర్ల ద్వారా ప్రతి రైతు లబ్ది పొందాలన్నదే పరామవదిగ ప్రయత్నాలు కొనసాగుతాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో పూడూర్ సర్పంచ్ బుజ్జి, మాజీ డీసీసీ పటేల్ ప్రకభాకర్ రెడ్డి, సీనియర్ నాయకులు బండ్ల రాజశేఖరరెడ్డి, పాచర్ల సురేందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, నరేందర్ రెడ్డి, నరేందర్ రెడ్డి, కేశవ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# మేడ్చల్-మల్కాజ్‌గిరి అర్బన్ బీజేపీ అధ్యక్షుడిగా గిరివర్ధన్ రెడ్డి నియామకం

### నూతన అధ్యక్షుడికి శుభాకాంక్షలు తెలిపిన కాంచి మహేందర్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు

**కూకట్ పల్లి, ఆగస్ట్ 8 (ప్రభాత ఉదయం)**

మేడ్చల్--మల్కాజ్‌గిరి అర్బన్ జిల్లా బిజెపి అధ్యక్షుడిగా గిరివర్ధన్ రెడ్డి నియమితులైన సందర్భంగా ఆయన నివాసంలో అభినందన కార్యక్రమం జరిగింది. బీజేపీ సీనియర్ నాయకులు కాంచి మహేందర్ ఆధ్వర్యంలో ఫతేనగర్ డివిజన్‌కు చెందిన బీజేపీ నాయకులు, కార్యకర్తలు గిరివర్ధన్ రెడ్డి నివాసానికి వెళ్లి మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన గిరివర్ధన్ రెడ్డికి హృదయపూర్వక శుభాకాంక్షలు, అభినందనలు తెలియజేశారు. పార్టీ కండువా కప్పి సత్కరించి, ఆయన నాయకత్వంలో మేడ్చల్--మల్కాజ్‌గిరి అర్బన్ పరిధిలో భారతీయ జనతా పార్టీ మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడంలో నూతన అధ్యక్షుడి నాయకత్వం కీలకంగా ఉంటుందని నాయకులు పేర్కొన్నారు. ప్రతి డివిజన్‌లో పార్టీ శ్రేణులను సమన్వయం చేసుకుంటూ, ప్రజా సమస్యలను నిరంతరం ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు కేంద్ర ప్రభుత్వ విధానాలు, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించాల్సిన అవసరం ఉందని తెలిపారు. గిరివర్ధన్ రెడ్డి నాయకత్వంలో పార్టీకి మరింత ఉత్సాహం, కొత్త దిశ లభిస్తుందని బీజేపీ శ్రేణులు ఆశాభావం వ్యక్తం చేశాయి. పార్టీ కోసం కష్టపడుతున్న నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ సంస్థాగతంగా బలోపేతం చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు కాంచి మహేందర్‌తో పాటు డివిజన్ బీజేపీ నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు పాల్గొని నూతన అధ్యక్షుడికి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ బలోపేతం, ప్రజా సమస్యల పరిష్కారం, రానున్న రోజుల్లో చేపట్టాల్సిన కార్యక్రమాలపై నాయకులు పరస్పరం చర్చించుకున్నారు.

**పార్టీ బలోపేతమే లక్ష్యం**

నూతన బాధ్యతలు స్వీకరించిన గిరివర్ధన్ రెడ్డికి పార్టీ శ్రేణుల నుంచి వెల్లువెత్తిన అభినందనలు బీజేపీ కార్యకర్తల్లో నూతన ఉత్సాహాన్ని నింపాయి. మేడ్చల్--మల్కాజ్‌గిరి అర్బన్ పరిధిలో పార్టీని మరింత బలమైన శక్తిగా తీర్చిదిద్దేందుకు నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా పనిచేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

# త్వరలో సీఎన్‌జీలో కూడా బయోగ్యాస్ మిళితం

### దేశీయంగా ఉత్పత్తి పెంచాలన్న లక్ష్యంలో కేంద్రం

### ఇంధన అవసరాలు తీర్చుకునేలా ప్రణాళికలు

**న్యూఢిల్లీ,ఆగస్ట్ 8 (ప్రభాత ఉదయం)**

దేశంలో పెట్రోల్‌లో ఇథనాల్ మిశ్రమాన్ని ప్రోత్సహించిన కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు మరో కీలక నిర్ణయం తీసుకుంది. త్వరలో సీఎన్‌జీలో కూడా బయోగ్యాస్‌ను మిళితం చేసి వినియోగదారులకు అందించేందుకు సిద్ధమవుతోంది. ఇందుకోసం కేంద్ర మంత్రివర్గం రూ.23,731 కోట్ల వ్యయంతో గోబర్ధన్ పథకానికి ఆమోదం తెలిపింది. ఈ పథకం ద్వారా దేశీయంగా కంప్రెస్డ్ బయోగ్యాస్ ఉత్పత్తిని పెంచడంతో పాటు, దిగుమతి చేసుకునే సహజ వాయువుపై ఆధారపడటాన్ని తగ్గించడమే ప్రభుత్వ లక్ష్యం. గోబర్ధన్ అంటే సేంద్రియ గ్యాస్.  ఈ పథకాన్ని 2027 నుంచి 2036 ఆర్థిక సంవత్సరాల మధ్య అమలు చేయనున్నారు. దేశవ్యాప్తంగా సేంద్రీయ వ్యర్థాలను వినియోగించి బయోగ్యాస్ ఉత్పత్తిని భారీగా పెంచడం, ఆ గ్యాస్‌ను సీఎన్‌జీ నెట్‌వర్క్‌లో వినియోగించడం ఈ పథకం ప్రధాన ఉద్దేశం. కంప్రెస్డ్ బయోగ్యాస్ ను పశువుల పేడ, పంట అవశేషాలు, పురపాలక వ్యర్థాలు, ఆహార వ్యర్థాలు, చెరకు కర్మాగారాల వ్యర్థాలు వంటి సేంద్రీయ పదార్థాల నుంచి ఉత్పత్తి చేస్తారు. శుద్ధి పక్రియ అనంతరం ఈ గ్యాస్ రసాయనికంగా సహజ వాయువుకు చాలా దగ్గరగా ఉంటుంది. అందువల్ల ఇప్పటికే ఉన్న సీఎన్‌జీ, పీఎన్‌జీ  పంపిణీ వ్యవస్థల ద్వారానే దీన్ని సరఫరా చేయవచ్చు. ప్రభుత్వం ప్రకటించిన ఈ నిర్ణయంతో ప్రస్తుతం ఉపయోగిస్తున్న సిఎన్‌జి కార్ల యజమానులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. బయో-గ్యాస్ రసాయనిక లక్షణాలు సహజ వాయువుకు సమానంగా ఉండటంతో వాహనాల్లో ఎలాంటి ఇంజిన్ మార్పులు లేదా హార్డ్‌వేర్ అప్‌గ్రేడ్ అవసరం ఉండదు. పెట్రోల్‌లో ఇ20 వినియోగానికి ప్రత్యేక ఇంజిన్ అవసరమైనట్లు గా, బయో-అఔఉ విషయంలో అలాంటి నిబంధనలు ఉండవు. ప్రభుత్వ ప్రణాళిక ప్రకారం నగర గ్యాస్ పంపిణీ సంస్థలకు బయోగ్యాస్ మిశ్రమం తప్పనిసరి కానుంది. 2026-27 ఆర్థిక సంవత్సరంలో 3 శాతం బయోగ్యాస్ మిశ్రమంతో ప్రారంభించి, 2027-28లో 4 శాతానికి, 2028-29 నుంచి 5 శాతానికి పెంచాలని లక్ష్యంగా పెట్టుకుంది. పథకం అమలుతో దేశీయంగా బయో-గ్యాస్ ఉత్పత్తి గణనీయంగా పెరుగుతుందని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. రాబోయే దశాబ్దంలో బయోగ్యాస్ ఉత్పత్తి దాదాపు 10 రెట్లు పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. దీంతో విదేశాల నుంచి సహజ వాయువు దిగుమతులపై ఆధారపడటం తగ్గి,

దేశ విదేశీ మారక వ్యయాన్ని కూడా తగ్గించవచ్చని నిపుణులు చెబుతున్నారు.్గ ÷ళింద్రీయ వ్యర్థాలను వినియోగించి ఇంధనం ఉత్పత్తి చేయడం వల్ల వ్యర్థాల నిర్వహణ మెరుగుపడటమే కాకుండా, పర్యావరణ కాలుష్యం కూడా తగ్గే అవకాశం ఉంది. అదే సమయంలో రైతులకు పంట అవశేషాలు, పశువుల పేడ వంటి వనరుల ద్వారా అదనపు ఆదాయం లభించే అవకాశాలు కూడా ఈ పథకం ద్వారా ఏర్పడనున్నాయి. దేశంలో స్వచ్ఛమైన ఇంధన వినియోగాన్ని పెంచే దిశగా గోబర్ధన్ పథకం కీలక అడుగుగా భావిస్తున్నారు.



# బోనాల పండుగలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలవకుండా భద్రత ఏర్పాట్లు చేయాలి

### నిర్వాహకులతో బాలానగర్ ఏసీపీ సమావేశం

### నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించిన బాలానగర్ ఏసీపీ పింగిలి నరేష్ రెడ్డి

**కూకట్ పల్లి, ఆగస్ట్ 8 (ప్రభాత ఉదయం)**

బోనాల పండుగను పురస్కరించుకుని ఉత్సవాలు ప్రశాంతంగా, సజావుగా నిర్వహించేందుకు బాలానగర్ ఏసీపీ ఆధ్వర్యంలో బోనాల పండుగ నిర్వాహకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పండుగ సందర్భంగా భక్తులకు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు, భద్రతా చర్యలు చేపట్టడంపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చించారు. ఈ సందర్భంగా బోనాల ఉత్సవాల నిర్వహణలో పోలీసు శాఖ సూచించే నిబంధనలు, మార్గదర్శకాలను నిర్వాహకులు తప్పనిసరిగా పాటించాలని ఏసీపీ సూచించారు. ఉత్సవాలకు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యే అవకాశం ఉన్నందున శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా నిర్వాహకులు ముందస్తు ప్రణాళికతో ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు.

**ప్రజల భద్రతకు ప్రాధాన్యత**

బోనాల పండుగ సందర్భంగా ఆలయాల వద్ద భక్తుల రద్దీ, ఊరేగింపులు, ప్రత్యేక కార్యక్రమాలు జరిగే ప్రాంతాల్లో ప్రజల రాకపోకలకు అంతరాయం కలగకుండా తగిన ఏర్పాట్లు చేసుకోవాలని ఏసీపీ సూచించారు. మహిళలు, వృద్ధులు, చిన్నారులు సహా అన్ని వర్గాల ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు. ఉత్సవాల సమయంలో వాహనాల రాకపోకలు, భక్తుల రద్దీ, ఊరేగింపు మార్గాలు, పార్కింగ్ తదితర అంశాలపై నిర్వాహకులు పోలీసులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. అత్యవసర పరిస్థితులు ఎదురైతే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు.

**పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి**

బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు నిర్వాహకులు పోలీసు శాఖకు పూర్తిస్థాయిలో సహకరించాలని ఏసీపీ కోరారు. పండుగ సందర్భంగా శాంతిభద్రతలకు భంగం కలిగించే చర్యలకు పాల్పడకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.

పోలీసుల సూచనలను పాటిస్తూ ఉత్సవాలను విజయవంతంగా నిర్వహిస్తే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పండుగను ఆనందంగా జరుపుకునే అవకాశం ఉంటుందని అధికారులు తెలిపారు. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసు శాఖ అన్ని విధాలా చర్యలు తీసుకుంటుందని, బోనాల ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించేందుకు నిర్వాహకులు, భక్తులు పోలీసులకు సహకరించాలని బాలానగర్ పోలీసులు విజ్ఞప్తి చేశారు.

# రైతులు ఆరుతడి పంటలు సాగు చేయాలి

### ఆయిల్ పామ్ సాగుతో కూడా మంచి ఆదాయం.

### ఎల్ నినో ప్రభావంతో ఈసారి వర్షాలు కురిసే అవకాశం తక్కువ:జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్.

**గద్వాల జిల్లా ప్రతినిధి,ఆగస్టు  (ప్రభాత ఉదయం)**



ఎల్ నినో ప్రభావంతో వర్షాలు తక్కువగా కురుస్తున్నందున రైతులు ఆరుతడి పంటలు సాగు చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జూరాల ప్రాజెక్టుకు ఎగువన ఉన్న జలా శయాల నుంచి ప్రస్తుతం పెద్ద ఎత్తున వరద వస్తున్నప్పటికీ ఆ నీటిని జిల్లాలో ఉన్న రిజర్వాయర్లు, చెరువులు నింపుకొని తాగు నీటి అవసరాలకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు చెప్పారు. జూరాల ప్రధాన కుడి కాలువ ద్వారా నీటిని విడుదల చేసినప్పటికీ వరద తగ్గుముఖం పడితే కాలువలకు నీటి సరఫరా నిలిపి వేయడం జరుగుతుందన్నారు. ఈ సంవత్సరం వర్షాలు తక్కువగా పడతాయన్న వాతావరణ శాఖ సూచనల మేరకు ఖరీఫ్ సీజన్ మొత్తం కాలువల ద్వారా నీటి విడుదల చేసే విషయంపై స్పష్టత లేదన్నారు. ఇరిగేషన్ శాఖ అధికారులు కూడా ఆయకట్టు రైతులకు వరి సాగు చేయవద్దని ఇప్పటికే తెలియజేయడం జరిగిందన్నారు. ఈనెల 7న హైదరాబాదు నుంచి పలువురు మంత్రులు, అధికారులు కూడా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లతో మాట్లాడుతూ... ఖరీఫ్ సీజన్లో వరికి బదులుగా ఆరుతడి పంటలు సాగు చేయాలని సూచించినట్లు పేర్కొన్నారు. వచ్చే వేసవి ముగిసే వరకు ప్రజల తాగు నీటి అవసరాలకు మొదటి ప్రాధాన్యతనిస్తూ వరద నీటితో ఎత్తిపోతల పథకాల ద్వారా జిల్లాలోని రిజర్వాయర్లు, చెరువులు, కుంటలను నింపుతున్నట్లు తెలిపారు. కందులు, మిర్చి, మొక్కజొన్న, పెసర్లు మినుములు, కూరగాయలు, తదితర ఆరుతడి పంటలతో కూడా రైతులకు మంచి ఆదాయం చేకూరుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆత్మ నిర్బరత పప్పు దినుసుల పథకం కింద సబ్సిడీకి కందులు, మినుముల విత్తనాలు అందజేస్తున్నందున జిల్లా రైతులు తమ సమీపంలోని వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వరి పంటకు నాలుగు నెలల పాటు మడులలో నిత్యం రెండు ఇంచుల నీళ్లు నిలువ చేయాల్సి వస్తుందని, కాబట్టి తక్కువ నీటితో పండించుకునే ఆరుతడి పంటలు సాగు చేసుకోవడం శ్రేయస్కరమని తెలిపారు. పంటల వైవిధ్యంతోనే నేల సారవంతత కూడా పెరుగుతుందని, పంట మార్పిడి విధానాలు రైతులకు మేలు చేస్తాయని ఇప్పటికే వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు తెలియజేశారన్నారు. ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో పందిరి కూరగాయల సాగుకు పందిరి నిర్మించుకునేందుకు ఒక్కో రైతుకు రెండున్నర ఎకరాల వరకు ఐదు యూనిట్ల చొప్పున, యూనిట్ కు రూ. 50 వేల చొప్పున ఆర్థిక సహకారాన్ని ప్రభుత్వం అందజేస్తున్నందున అన్నదాతలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వం గత కొన్నేళ్లుగా ఆయిల్ పామ్ పంటల సాగును కూడా ప్రోత్సహిస్తున్నట్లు గుర్తు చేశారు. ఆయిల్ పామ్ మొక్కల మధ్యన అంతర పంటలుగా మూడేళ్లపాటు పప్పు దినుసులు, కూరగాయలు వంటి స్వల్ప కాలిక పంటలతోనూ లబ్ధి పొందవచ్చన్నారు. పామ్ గెలలు నాలుగో సంవత్సరం నుంచి వస్తాయని, అప్పుడు సమీపంలోని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మంచి ఆదాయాన్ని పొందవచ్చన్నారు. ఆయిల్ పామ్ తోటల సాగుకు ప్రభుత్వం రైతులకు సబ్సిడీకి మొక్కలను అందజేయడంతో పాటు బిందు సేద్య పరికరాలను కూడా ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం ఈ పంటకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉన్నందున రైతులు వరి వంటి సాంప్రదాయ పంటలకు బదులుగా  ఎక్కువ ఆదాయాన్ని పొందే అవకాశం ఉన్న పామ్ తోటలతో ఆర్థిక పురోగతి సాధించాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆకాంక్షించారు.